ప్రజాశక్తి

గురువారం 1 మే 2025 8 పేజీలు





గుంటూరు పల్నాడు

రేపు వెలగపూడికి ప్రధాని రాక



ఏర్పాట్లను పరిశీలిస్తున్న గుంటూరు జిల్లా కలెక్టర్

- తుదిదశకు చేరిన మోడీ పర్యటన ఏర్పాట్లు
- ఆరు జిల్లాల నుండి ఐదు లక్షల మంది సమీకరణకు కసరత్తు
- రాజధాని రైతులకు ప్రత్యేక గ్యాలరీ
- ఇంటింటికి తిరిగి ఆహ్వానిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

అమరావతి పునర్ నిర్మాణ పనుల శంకుస్థాపనకు శుక్రవారం రాజధానికి రానున్న ప్రధాని మోడీ సభకు ఐదు లక్షల మంది ప్రజలను సమీకరణకు కసరత్తు జరుగుతోంది. సభ నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నారు. వివిధ జిల్లాల నుంచి ప్రజలు సభకు ▶ 2లో



పొగాకు కొనుగోలు చేసే వరకూ ఉద్యమం

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి

ప్రజాశక్తి-గుంటూరు

రైతుల వద్ద ఉన్న పొగాకు పూర్తిగా కొనుగోలు చేసే వరకూ ఐక్య ఉద్యమం కొనసాగుతుందని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘాల సమన్వయ సమితి తెలిపింది. బుధవారం స్థానిక బ్రాడీపేటలోని పిఎల్.రావు భవన్‌లో జరిగిన సమావేశంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కష్ణయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కె.వి.వి ప్రసాద్, నల్లమడ రైతు సంఘం నాయకులు కొల్లా రాజమోహన్, కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై.రాధాకష్ణ, ఎం.హరిబాబు, రైతుకూలీ సంఘం నాయకులు వి.నరసింహారావు మాట్లాడారు. రెండు నెలలుగా బర్లీ పొగాకు కొనుగోళ్లు నిలిచిపోవటంతో రైతులు, సంఘాలుగా ఆందోళన చేస్తున్నామన్నారు. 5వ తేదీన చలో సిఎం క్యాంప్ కార్యాలయంకు పిలుపు ఇచ్చిన నేపథ్యంలో మంగళవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ▶ 2లో

క్రికెట్ బెట్టింగ్‌కు యువకుడు బలి? మెయిన్‌లో

విఆర్ఎలను నిరాశపర్చిన కూటమి ప్రభుత్వం

- జీతాల పెంపు, ప్రమోషన్ల కల్పనలో నిర్లక్ష్యం
- సమస్యలపై పల్నాడు కలెక్టరేట్ ఎదుట ధర్నా - వినతి

4 లో

ప్రధాని మోడీ పర్యటన వేళ వర్ష గుబులు

ఫ్లై ఓవర్ కాకుండా బ్రిడ్జి నిర్మిస్తే చారిత్రాత్మక తప్పిదమే

- ప్రజల కోసమే డిజైన్‌లో సవరణలు కోరుతున్నాం
- షాప్ ఓనర్స్ అండ్ షాప్ కీపర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

8 లో

ఐటిఐ తొలి విడత ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - తెనాలి

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటిఐ కళాశాలలో తొలి విడత ప్రవేశాలకు ఈ నెల 24 లోగా దరఖాస్తు చేసుకోవాలని కన్వీనర్ రావి చిన్న వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు తెనాలి, గుంటూరు ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ఏర్పాటుచేసిన నమోదు కేంద్రాల్లో తమ పేర్లను iti.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని, పరిశీలన చేయించుకోవాలన్నారు. పరిశీలన చేయించుకున్న అభ్యర్థులు మాత్రమే జూన్ 2 నుంచి 10వ తేదీ వరకు తెనాలి ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు. వివరాలకు 9347795839, 6304572793, 9014491772 నంబర్లలో కళాశాల పని వేళల్లో సంప్రదించాలని సూచించారు.



ఫైనాన్స్ అధికారిగా సత్యనారాయణ

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నూతన ఫైనాన్స్ ఆఫీసర్‌గా జి.సత్యనారాయణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను వికాస నాయకులు, ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



విసదలలో రహదార్లకు శంకుస్థాపన

ప్రజాశక్తి -మేడికొండూరు

మండలంలోని విసదల గ్రామంలో సిసి రోడ్లు, జెడ్‌పి రోడ్లకు బుధవారం శంకుస్థాపన చేశారు. విసదల రైస్ మిల్లు నుండి సరిపూడి అడ్డరోడ్డు వరకు తారు రోడ్డు, విసదల గ్రామంలో ఖాజీపేట శ్రీను ఇంటి దగ్గర నుండి మర్రి కృష్ణ రోడ్డు వరకు సిమెంట్ రోడ్డు పనులు చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి గ్రామ ఆధ్యక్షులు సాయిబాబు నాయకులు ఇన్యాసి, కోటేశ్వరరావు, ఎం.సీతారామయ్య, జనసేన నాయకులు ఎల్.శివప్రసాద్, అలీ, జమాల్, కాంట్రాకర్ శేషిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రూ.55.57 కోట్లతో పన్ను వసూళ్లలో జిఎంసి రికార్డు : కమిషనర్

ప్రజాశక్తి - గుంటూరు



ఆస్తి పన్నువడ్డీపై 50 శాతం రాయితీ, ముందస్తు పన్ను చెల్లింపులపై 5శాతం రాయితీతో పన్ను వసూళ్లలో గుంటూరు నగరపాలక సంస్థ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రికార్డు సాధించిందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 30 తేదీ నాటికి రూ.55.57 కోట్లు వసూలైనట్లు వెల్లడించారు. వడ్డీపై, అడ్వాన్స్ ట్యాక్స్‌పై రాయితీని నగరంలో 52,680 మంది వినియోగించుకున్నారని, గతేడాది కంటే 25 శాతం మంది అధికంగా ఈ అవకాశాన్ని వినియోగించుకోవటం అభినందనీయమని పేర్కొన్నారు. ఏప్రిల్ నెలలో రెవెన్యూ వసూళ్లలో ఆస్తి పన్ను రూ.52.31 కోట్లు, ఖాళీ స్థల పన్ను రూ.3.26 కోట్లు వసూళ్లు చేసినట్లు తెలిపారు. గతేడాది 45,542 మంది నుండి రూ.44.45 కోట్లు వసూలైందని, గత సంవత్సరం కంటే రూ.11 కోట్లు అధికంగా పన్ను వసూళ్లు చేసిన అడ్మిన్ కార్యదర్శులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, రెవెన్యూ అధికారులు, డిప్యూటీ కమిషనర్లు, అదనపు కమిషనర్‌కు అభినందనలు తెలిపారు.



శ్రీశ్రీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అవగాహన సభ్యులు

శ్రీశ్రీ రచనలు అజరామరం

ప్రజాశక్తి-గుంటూరు

ఆధునిక ఆంధ్ర సాహిత్యంలో అభ్యుదయ యుగానికి నాంది పలికిన మహాకవి శ్రీశ్రీ సాహితీ జగత్తులో ఆయన రచనలు అజరామరంగా నిలిచిపోతాయని కవులు, సాహితీవేత్తలు అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో బుధవారం శ్రీశ్రీ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సాహితీవేత్త ముప్పాళ్ల ప్రసాదరావు మాట్లాడుతూ ధనికస్వామ్య దురాశాపిశాచికి బలై అల్లాడుతున్న పేదల వాణిని వినిపింపచేసిన విప్లవ కవి శ్రీశ్రీ అన్నారు. తెలుగులో వినూత్న కవితా ప్రయోగశీలిగా అభ్యుదయ కవితా మార్గ ప్రవర్తకుడిగా, భావకవితా యుగంలో భాషలో, వస్తువులో చందస్సులో కొత్త పోకడలను సృష్టించిన సత్కవిగా ఖ్యాతి గాంచాడన్నారు. కవి జమదగ్ని మాట్లాడుతూ మహాప్రస్తానం, మరోప్రపంచం, చరమరాత్రి, ఖడ్గసృష్టి, అనంతం లాంటి రచనలు శ్రీశ్రీ ప్రతిభకు పాండిత్యానికి ప్రతీకలుగా నిలుస్తాయని చెప్పారు. కార్యక్రమంలో రచయిత్రి పింగళి భాగ్యలక్ష్మి, రాజశేఖర్, సాయిబాబు, రామకృష్ణారెడ్డి మాట్లాడారు.

పొగాకు కొనుగోలు చేసే వరకూ ఉద్యమం

(మొదటి పేజీ తరువాయి)

అచ్చెన్నాయుడు సమక్షంలో కంపెనీలు, అధికారులు, రైతు సంఘాలతో జరిగిన సమావేశంలో కొనుగోళ్లకు సంబంధించి ప్రభుత్వం హామీ ఇచ్చిందని తెలిపారు. వైట్‌బర్లీ, బ్లాక్ బర్లీ కొనుగోలు చేయాలని కంపెనీలకు ప్రభుత్వం ఆదేశాలివ్వగా కంపెనీలు అంగీకరించాయన్నారు. తక్షణమే ప్రభుత్వ హామీ అమల్లోకి రావాలని, కొనుగోళ్లు ప్రారంభించాలని కోరారు. ఇప్పటికే రెండు నెలలు ఆలస్యమైనందున మే నెలలోగా కొనుగోళ్లు మొత్తం పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ హామీ పూర్తిగా నెరవేరే వరకూ ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో సుమారు మూడు లక్షల ఎకరాల్లో పొగాకు సాగు చేశారని, అందులో సగం బర్లీ పొగాకు ఉంటుందని, కంపెనీలు కొనుగోలు చేయకపోవటంతో రైతులు పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని తెలిపారు. మొదట కొనుగోలు చేస్తామన్న కంపెనీలు మొహం చాటేయగా రైతుల ఆందోళనతో ప్రభుత్వం కొనుగోలుకు హామీ ఇచ్చిందని, దీన్ని ఆచరణలోకి తేకుంటే ఉద్యమిస్తామని చెప్పారు. నాణ్యత, తేమశాతం పేరుతో కంపెనీలు పొగాకు కొనుగోలు చేయకపోతే రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలన్నారు. సమావేశంలో వివిధ రైతు, కౌలురైతు సంఘాల నాయకులు కె.అజయ్‌కుమార్, పి.శివాజీ, కె.రంగారెడ్డి, పి.జమలయ్య, ప్రొఫెసర్ ఎన్.వేణుగోపాలరావు, బాపట్ల జిల్లా నాయకులు సిహెచ్.గంగయ్య, కె.రామకోటేశ్వరావు, ప్రకాశం జిల్లా నాయకులు జె.జయంతిబాబు, ఎం,జగన్నాథం, కె.విటల్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు వెలగపూడికి ప్రధాని రాక

(మొదటి పేజీ తరువాయి)



వచ్చేందుకు వీలుగా 7 వేల బస్సులు, వెయ్యి కార్లు పార్కింగ్‌కు ఏర్పాటు చేస్తున్నారు పలువురు మంత్రులు, సీనియర్ ఐఎఎస్, ఐపిఎస్ అధికారులతో పాటు గుంటూరు జిల్లా యంత్రాంగం మొత్తం ప్రధాని పర్యటనపై దృష్టి సారించాయి. జిల్లాలోని పలువురు సచివాలయాల ఉద్యోగులకు కూడా ప్రధాని పర్యటన ఏర్పాట్లపై క్షేత్రస్థాయి బాధ్యతలు అప్పగించారు. దీంతో గురు, శుక్రవారాల్లో పంపిణీ చేయాల్సిన పెన్షన్‌లను ఒక రోజు పొడిగించి శనివారం కూడా పంపిణీ చేస్తామని డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరక్టర్ విజయలక్ష్మీ తెలిపారు. వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా వర్షం వచ్చినా ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని మునిసిపల్ మంత్రి నారాయణ బుధవారం వెలగపూడిలో ప్రధాని సభ ఏర్పాట్లపై మీడియాకు తెలిపారు.

శాశ్వత హైకోర్టు, సచివాలయం, అసెంబ్లీ భవనాలను నిర్మించేందుకు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. ఐఎఎస్, ఐపిఎస్, మంత్రులు, ఎమ్మెల్యేల నివాసాలను కూడా నిర్మించనున్నారు. రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు అధికారులు ఇళ్లకు వెళ్లి అమరావతి పునర్ నిర్మాణ శంకుస్థాపన సభకు రావాల్సిందిగా ఆహ్వానాలు అందిస్తున్నారు. రాజధాని గ్రామాల్లో ఈసారి శాశ్వత ప్రాతిపదికన రూ.49,040 కోట్లతో చేపట్టనున్న నిర్మాణాలకు ప్రధాని మోడి శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్రంలోని పలు రైల్వే ప్రాజెక్టులు, జాతీయ రహదారి నిర్మాణాలకు వర్చువల్‌గా ప్రారంభం చేస్తారని అధికారులు తెలిపారు. గుంటూరు -గుంతకల్ రైల్లే ఎలక్ట్రిఫికేషన్, డబ్లింగ్ పనులు పూర్తయినందున ఈ ప్రాజెక్టును కూడా ప్రధాని వర్చువల్‌గా ప్రారంభిస్తారని రైల్వే అధికారులు తెలిపారు. విజయవాడ-ఖాజీపేటకు మూడో లైను నిర్మాణంకు, డిఆర్‌డివో, డిపిఐపి, నాయ్, రైల్వే ప్రాజెక్టులకు మొత్తం రూ.57,962 కోట్లతో చేపట్టిన, చేపట్టనున్న ప్రాజెక్టులకు ప్రధాని శ్రీకారం చుట్టనున్నారు. నాగాలాండ్‌లో రూ.1500 కోట్లతో మిస్సైల్ తయారీ కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. ప్రధాని వేదిక ముందు భాగంలో రాజధాని రైతులకు ఒక ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేశారు. ప్రధాని వేదికపై 14 మందికి అవకాశం కల్పించనున్నారు. వీరిలో జిల్లా నుంచి తాడికొండ ఎమ్మెల్యే, గుంటూరు ఎంపి, కేంద్ర మంత్రి పెమ్మసాని, గుంటూరు జిల్లాకు చెందిన మంత్రులు నారా లోకేష్, నాదెండ్ల మనోహర్ తదితరులకు అవకాశం ఇవ్వనున్నారు. గుంటూరు ఐజి సర్వశ్రేష్ట త్రిపాఠి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ భార్గవ తేజ,మునిసిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులు, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు ప్రధాని పర్యటనలో నిమగ్నమయ్యారు. గత వారం రోజులుగా వీరంతా ఈ ఏర్పాట్లలోనే ఉన్నారు. పలువురు రాష్ట్ర ఉన్నతాధికారులు, మంత్రులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

రాజకీయ నాయకులకు వావిలాల గోపాలకృష్ణయ్య ఆదర్శం

ప్రజాశక్తి-గుంటూరు



వావిలాల గోపాలకృష్ణయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

స్వాతంత్ర్య సమరయోధులు వావిలాల గోపాలకృష్ణయ్య జీవితం నేటి రాజకీయ నాయకులకు ఆదర్శం కావాలని మాజీమంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో వావిలాల గోపాలకృష్ణయ్య 22వ వర్ధంతిని పురస్కరించుకుని 'శాసనసభ్యులు నాడు - నేడు' అనే అంశంపై జనచైతన్య వేదిక హాల్లో చర్చా గోష్టి నిర్వహించారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ తెలుగు ప్రజలు ధనస్వామ్యానికి బలమైన ప్రత్యామ్నాయ రాజకీయాలను కోరుకుంటున్నారని, నేటి రాజకీయాల్లో వావిలాల లాంటి నిజాయితీపరులకు అవకాశం, మద్దతు కల్పించడం లేదన్నారు. లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ వావిలాల గోపాలకృష్ణయ్య స్వల్ప వ్యయంతో నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై పేదల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్యేలు రూ.30 కోట్లకుపైగా వ్యయంచేసి గెలిచాక, అవినీతిపరులుగా మారుతున్నారని, సహజ వనరులు దోచుకుంటున్నారని అన్నారు. లోక్‌సభలో 46 శాతం, రాష్ట్ర శాసన సభలో 79 శాతం సభ్యులు క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ వావిలాల సంస్థను పునర్జీవనం చేసి బహుముఖ కార్యక్రమాలను నిర్వహించాలని ఆకాంక్షించారు. 1937 నుండి 1990 వరకు జరిగిన ఎన్నికలలో ధన ప్రభావం తక్కువగా ఉండి, నిజాయితీ, విలువల్ని ఆచరించే వారన్నారు. నేడు రాజకీయాలలో ఏమాత్రమూ అవగాహన లేనివాళ్లు కేవలం అర్థ బలంతో చట్టసభలకు ఎన్నికవుతున్నారని చెప్పారు. లోక్‌సభలో 543 మందిలో 400 మందికిపైగా శతకోటీశ్వరులున్నారన్నారు. 1991 నుండి ఆర్థిక సంస్కరణల ఫలితంగా రాజకీయాలు కూడా కార్పొరేట్ మయం అయ్యాయన్నారు. ఎన్నికలలో ధన ప్రభావం కొంతైనా తగ్గించడానికి దామాషా పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో వావిలాల గోపాలకృష్ణయ్య మనవడు, వావిలాల సంస్థ సంయుక్త కార్యదర్శి మన్నవ షోడేకర్, విద్యావేత్త ప్రొఫెసర్ డిఎఆర్ సుబ్రహ్మణ్యం, విద్యావేత్త కన్నా మాస్టర్ పాల్గొన్నారు.

నేడు మే డే

- **కార్మికుల శ్రమను దోచుకుంటున్న సంస్థలు**
- **అసంఘటిత రంగంలో మూడు లక్షల మంది నమోదు**

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కార్మికుల దినోత్సవం మేడే ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో గురువారం నిర్వహించనున్నారు. శ్రమను నమ్ముకున్న కార్మికులు, వ్యవసాయ కార్మికులు, కార్మాగారాలు, కంపెనీలల్లో పనిచేస్తున్న లక్షలాది మంది తమ చమటోడ్చి జిల్లాలో నిత్యం జీవనం కొనసాగిస్తున్నారు. ఇప్పటికీ చాలా కార్మాగారాలు, కంపెనీల్లో కనీస వేతనాలు కూడా లేకుండానే వేలాది మంది పనులకు హాజరు అవుతున్నారు. అసంఘటిత రంగంలో జిల్లాలో దాదాపు మూడు లక్షల మంది కార్మికులు ఉండగా సంఘటిత రంగంలో మరో మూడు లక్షల మంది కార్మికులు పనిచేస్తున్నారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న వారానికి మూడు నుంచి నాలుగు రోజులు కూడా పని దొరకడం లేదు. సంఘటిత రంగంలో పనిచేస్తున్న వారికి వేతనాలు నామమాత్రంగానే ఉన్నాయి. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులను ఆదుకుంటామని కేంద్ర కార్మిక శాఖ ఈశ్రమ పోర్టల్‌లో 18 ఏళ్ల నుంచి 59 ఏళ్లమధ్య వారు నమోదు చేసుకోవాలని కోరితే జిల్లా నుంచి దాదాపు రెండు లక్షల మంది వరకు నమోదు చేసుకున్నారు. కానీ వీరిలో ఇంత వరకు ఎటువంటి వంటి సదుపాయాలు పొందని వారు 90 శాతంపైగా ఉన్నారు. ప్రమాదాల్లో మృతి చెందిన వారికి మాత్రమే రూ. 2లక్షల వరకు ఈ శ్రమ బీమా సదుపాయం ఉంటుంది. అలాగే కార్మికులకు గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అమలులో ఉన్న పథకాలన్నీ గత ఏడాది కాలంగా నిలిచిపోయాయి. గత ప్రభుత్వ హయంలో కార్మిక సంక్షేమపథకాలపై కోతలు విధించారని ఆరోపించిన టిడిపి నాయకులు అధికారంలోకి వచ్చిన తరువాత ఇంత వరకు ఏ పథకంను అమలుకు విధి విధానాలు ప్రకటించలేదు. కొత్త పథకాలు కూడా ప్రకటించలేదు. కార్మిక శాఖకు సంబంధించి కూటమి ప్రభుత్వం ఎటువంటి సంక్షేమం, సదుపాయాల కల్పనపై ఉత్తర్వులు వెలువరించలేదు. దీంతో కార్మిక శాఖ అధికారులు కూడా వీటిపై ఏమీ చేయలేకపోతున్నామని చెబుతున్నారు. మరో వైపు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలన్న సుప్రీంకోర్టు అమలు కూడా ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాలేదు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న డిమాండ్‌పై కూడా ప్రభుత్వం స్పందించడం లేదు. వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు శాశ్వత ఉద్యోగులతో పాటు పూర్తి స్థాయిలో విధులు నిర్వహిస్తున్నా అరకొర వేతనాలతోనే జీవనం సాగిస్తున్నారు. అలాగే చాలా మందికి ఉద్యోగ భద్రత లేదు. జిల్లాలో అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ ద్వారా దాదాపు 30 వేల మంది వరకు పనిచేస్తున్నారు. వీరికి ఉద్యోగ భద్రత లేదు. అలాగే మహిళా ఉద్యోగులు వివిధ ప్రైవేటు సంస్థల్లో రోజుకు సగటున 10 నుంచి 12 గంటలు పనిచేస్తున్నా కనీస వేతనాలు అందడం లేదు. మాల్స్,. సూపర్ మార్కెట్లు, దుకాణాలు, వ్యాపార సంస్థల్లో 10 గంటల పాటు నిలబడి పనిచేస్తున్నా ఎటువంటి సదుపాయాలు లేవు. కనీస వేతనాలు అందడం లేదు. భవన నిర్మాణ కార్మికులు, ఫ్యాక్టరీ కార్మికులు, వివిధ సంస్థల్లో పనిచేసే వారికి పూర్తి స్థాయిలో పని దొరకడం లేదు. జిల్లాలో స్థానికంగా ఉన్న కార్మికుల కన్నా తక్కువ వేతనాలకు పనిచేస్తారని ఇతర రాష్ట్రాలకు చెందిన వారిని కాంట్రాక్టు సంస్థలు జిల్లాకు తీసుకువస్తున్నారు. రాజధాని అమరావతి నిర్మాణంలో స్థానిక కార్మికుల కన్నా కాంట్రాక్టర్లు, నిర్మాణ దారుల ఇతర రాష్ట్రాల వారికే ప్రాధాన్యత ఇస్తుండటం విమర్శలకు దారితీస్తోంది.

అమరావతి సభకు ముమ్మర ఏర్పాట్లు

ప్రజలకు ఆహారం, నీటి సదుపాయాల కల్పనకు ప్రణాళిక

యడ్లపాడులో ఏర్పాటుకు జిల్లా శాఖల అధికారుల సందర్శన

పరిశీలించిన ఎస్పీ కె.శ్రీనివాసరావు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పి శ్రీనివాసరావు, ఇతర అధికారులు

ప్రజాశక్తి - యడ్లపాడు

మే 2న జరిగే అమరావతి సభ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ విచ్చేయనున్న కార్యక్రమానికి ఏర్పాట్లు ఊపందుకున్నాయి. బుధవారం ఎస్పీ కంచి శ్రీనివాస్ రావు తో పాటు పలువురు జిల్లాస్థాయి అధికారులు యడ్లపాడు గ్రామాన్ని సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. విను కొండ, నరసరావుపేట, చిలకలూరిపేట నుంచి వచ్చే ప్రజల కోసం 369 బస్సులను ఏర్పాటు చేసినట్టు అధికారు లు తెలిపారు. ఈ బస్సుల ప్రయాణికులకు ఆహార, మంచి నీటి సౌకర్యాల కోసం యడ్లపాడు మండలంలోని మూడు ప్రాంతాలను పరిశీలించగా, హైవేవంతెన పక్కన (చిలక లూరిపేట వైపు) ఉన్న స్థలం అనుకూలంగా ఉండడం తో అక్కడే ఏర్పాట్లు ఖరారు చేశారు. మండలంలోని 23 గ్రామా లకు చెందిన ప్రజలకు వారి గ్రామాల్లోనే ఆహారం సిద్ధం చేసి బస్సుల్లో అందించే విధంగా ప్రత్యేక ప్రణాళిక రూపొం దించారు. బుధవారం జిల్లా అధికారుల బందం యడ్లపాడు గ్రామాన్ని సందర్శిం చింది. పోలీసు, మార్కెటింగ్, రెవెన్యూ, పంచా యతీ రాజ్ శాఖలకు చెందిన అ్యధికారులతో ఫుడ్‌వెండింగ్ పాయింట్‌ను నోట్ చేశారు. కార్యక్రమంలో నరసరావుపేట డీఎస్పీ కె నాగేశ్వరరావు, డీఆర్ఓ మురళి, మార్కెటింగ్ ఏడి సూర్యప్రకాశ్‌రావు, యడ్లపాడు, నాదెండ్ల తహసీల్దార్లు, ఏవీ రమణ, యడ్లపాడు డీటీ అనురాధ, ఎంపీడీవో హేమ లతాదేవి, స్వరూపారాణి, ఈవోపీఆర్‌డీ షేక్ జాకీర్ హుస్సేన్, అర్బన్‌సీఐ టి.రమేష్, యడ్లపాడు, రూరల్ ఎస్ఐలు టిశివరామకష్ణ, జి అనిల్‌కుమార్, వీఆర్వో కేపి చారి పాల్గొన్నారు.

ప్రధాని పర్యటనలో నిషేధాజ్ఞలు

డ్రోన్‌లు, బెలూన్లు ఎగురవేయవద్దు : ఎస్పీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రధాని మోడీ రాజధాని పర్యటనను పురస్కరించుకుని ఎవ్వరూ డ్రోన్లు, బెలూన్లు ఎగుర వేయవద్దని జిల్లా ఎస్‌పి సతీష్ కుమార్ తెలిపారు. వెలగపూడిలో ప్రధాని పర్యటన జరగనుం దని, ఈ ప్రాంతంలో డ్రోన్లు, నలుపు,ఇతర రంగుల బెలూన్టు ఎగుర వేయరాదని కోరారు. ఈమేరకు నిషేదాజ్ఞలు అమలులో ఉంటాయన్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో హెలికాప్టర్ రాక పోకలు జరగనున్నందున వీటిని ఎగుర వేయడం వల్ల ఏవైనా అవాంచనీయ సంఘటనలు జరిగే అవకాశం ఉన్నందున వాటిని గురవేయరాదని తెలిపారు. ఎవరైనా నిషేదాజ్ఞలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రోడ్డు ప్రమాదం కేసులో ఒకరికి

ఆరు నెలలు జైలు శిక్ష, జరిమానా

ప్రజాశక్తి -మేడికొండూరు

నిర్లక్ష్యంగా వాహనం నడపడంతో, ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటనలో వెంకట బాల కృష్ణకు ఆరు నెలలు జైలు శిక్షతో పాటు రూ. 2 వేలు జరిమానాను గుంటూరు ఐదవ అడిషనల్ జూని యర్ సివిల్ జడ్జి కే లత బుధవారం తీర్పునిచ్చారు. మండలంలోని వరగాని గ్రామానికి చెందిన బోడ పాటి కిరణ్ అనే వ్యక్తిని చందోలు బాలకృష్ణ తన వాహనంతో అతి వేగంగా ఢీకొట్టడంతో తీవ్రగా యాలయ్యాయి. కుడికాలు విరిగింది. ఈ సంఘ టనపై కేసు నమోదు అయి, కేసులో నేరం రుజువు కావడంతో చందోలు వెంకట బాలకృష్ణకు జైలు శిక్షతోపాటు అపరాధ జరిమానా విధించారు.

షర్మిల హౌస్ అరెస్టు

ప్రజాశక్తి - గన్నవరం

కృష్ణాజిల్లా గన్నవరం మండలం కేసరపల్లి ఎస్‌వీఎల్ గేటెడ్ కమ్యూనిటీలో ఉంటున్న ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు షర్మిలను బుధవారం పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. రాజధాని అమరావతి ప్రాంతంలోని ఉద్దండరాయునిపాలెంలో వెళ్తారని ముందస్తు సమాచారం రావడంతో పోలీసులు ఆమెను ఇంటివద్దే అడ్డుకున్నారు. ఇంటి నుండి బయటకు రాకుండా నిర్బంధించారు. ఒకానొక సందర్భంలో మహిళ పోలీసులు ఆమె ఒంటిపై చేయి వేసి నెట్టిన పరిస్థితి వచ్చింది. దీంతో పోలీసుల తీరుపై షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "పోలీసులు నా ఒంటి మీద చెయ్యి వేస్తారా.. ప్రజా సమస్యల మీద ప్రశ్నించే హక్కు నాకు లేదా... దీనికి కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలి" అని డిమాండ్ చేశారు. తనను ఎందుకు హౌస్ అరెస్ట్ చేశారని, ఒక పార్టీ అధ్యక్షురాలిపై ఇటువంటి జులుం ఏంటని, చంద్రబాబు, హోంమంత్రి అనిత దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అమరావతి రాష్ట్ర రాజధాని అని, రాజధాని ఎలా ఉందో చూడటం తప్పా అని ప్రశ్నించారు. అమరావతిపై రీసెర్చ్ చేయాలని అనుకుని కాంగ్రెస్ నుండి అమరావతి క్యాపిటల్‌పై ఓ కమిటీ వేశామని, కమిటీ తరుపున అమరావతి వెళ్లి చూద్దామని అనుకున్నామని అన్నారు. ఓ కమిటీ వేస్తేనే ప్రభుత్వానికి ఇంత భయమా అని అన్నారు. అమరావతి రాజధానిలో ఏం దాచాలని అనుకుంటున్నారో పాలకులు చెప్పాలన్నారు. ఈ నెల 2న ప్రధాని మోడీ వస్తున్నారని, ఆయనను డిమాండ్ చేయాల్సిన అంశాలు చాలా ఉన్నాయని అన్నారు. వాటిపై మాట్లాడే హక్కు తమకు లేదా అన్నారు. తన ఇంటి ముందు ఇంత సెక్యూరిటీ ఎందుకని, తాను శాంతిభద్రతల సమస్యలను సృష్టించడంలేదని అన్నారు. ఇప్పటికే మహిళలపై అత్యాచారాల్లో రాష్ట్రం దేశంలోనే మూడో స్థానంలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు గొల్లు కష్ణ తదితరులు పాల్గొన్నారు.



తీవ్ర సమస్యగా పొగాకు అమ్మకం



తిరస్కరించిన చెక్కులను, ట్రాక్టర్‌ను వెనక్కి తెచ్చుకున్న దృశ్యం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

సూపర్ ఫైన్ బెస్ట్ క్వాలిటీగా ఉండి, తేమ శాతం 15 కంటే తక్కువ ఉన్న నల్ల బర్లీ పొగాకు రూ.12వేల ధరకు ప్రస్తుతానికి జిపిఐ కంపెనీ కొనుగోళ్లు చేస్తోంది. తేమ 15 శాతం కన్నాకొద్దిపాటి ఎక్కువగా ఉండి, ఆకు రంగు కూడా కొద్దిపాటి తేడాగా ఉంటే రూ. 9 నుంచి 10వేల వరకు ధర వేసి కొనుగోలు చేస్తున్నారు. పొగాకు పంట అమ్ముకోవటం రైతులకు తీవ్రమైన సమస్యగా పరిణమించింది. ఒక్క జిపిఐ కంపెనీ మాత్రమే ప్రస్తుతానికి కేవలం నల్లబర్లీ పొగాకును యడ్లపాడు మండల తిమ్మాపురం వద్ద ఏప్రిల్ 23వ తారీఖు నుంచి కొనుగోళ్ల కేంద్రాన్ని ప్రారంభించి కొనుగోళ్లు చేస్తోంది. ఈ కేంద్రానికి ఈ చుట్టూ పక్కల ప్రాంతాల నుంచే కాక దూర ప్రాంత్రాలనుంచి రైతులు నల్లబర్లీ పొగాకుని అమ్ము కునే నిమ్మిత్తం తెస్తున్నారు. ఈ కొనుగోలు కేంద్రానికి రోజుకి సుమారుగా 160 నుంచి 180 చెక్కుల వరకు వస్తున్నాయి. అందులో అది తక్కువైంది. ఇది తక్కువైంది. నాణ్యత తక్కువ గా ఉన్న దని,మరి కొన్ని చెక్కులకు మాయిశ్చ రైజ్ఞ (తేమ శాతం)15 శాతం కంటే ఎక్కువ ఉందనే ఉద్దేశ్యంతో కొనుగోలు చేయకుండా తిరిగి తిప్పి రోజుకు సుమారుగా 20, 25 చెక్కులను పంపిస్తున్నారని రైతులు గగ్గోలు పెడుతున్నారు. అసలే వేస్తున్న ధరలు తక్కువ. దానికి తోడు అనేక రకాల వంకలతో రిటర్న్ అంటే తీసుకురాను తీసుకు పోను అక్కడ ఎత్తుడు, కేంద్రంలో దించటానికి, రవాణా ఇతర ఖర్చులు మొత్తం కలుపుకొనిచెక్కుకి (క్వింటా) సుమారుగా రూ. వెయ్యి, 15వందల ఖర్చువుతోందని రైతులంటున్నా రు.

రూ.15వేలకు తగ్గకుండా కంపెనీలన్నీ కొనాలి

నల్లబర్లీ పొగాకు రూ.15 వేలకు తగ్గకుండా మొత్తం పొగాకును కంపెనీలన్నీ కలసి కొనుగోలు చేయాలి. నల్ల బర్లీ పొగకును బోర్డు పరిధిలోకి తేవాలి. ఈ పొగాకు కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం నిత్యం మానిట రింగ్ చేయాలి. ముఖ్యంగా పొగాకు రైతులకు ప్రతిరోజు కొనుగోలు సమాచారాన్ని అందించి పొగాకు రైతాంగాన్ని ఆదుకోవాలి. పొగాకు రైతుల పలు సమస్యల పరిష్కారా నికి నాదెండ్ల గ్రామంలో గురువారం పొగాకు రైతుల సద స్సు నిర్వహిస్తున్నారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలి.

వై.రాధాకృష్ణ, కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు

పలు కారణాలతో చెక్కులు తీసుకోవడం లేదు



పదిచెక్కులకు గేట్ పాస్ ఇచ్చా రని తీరా ఇక్కడకు తెచ్చిన తరు వాత వాటిల్లో 5 చెక్కులు అనేక కారణాలతో తీసుకోమం టున్నారని అన్నారు. రంగప్ప నాయుడు పాలెం గ్రామం నుంచి ఇక్కడకు తీసుకు రావడానికి ట్రాక్టరుకు రూ.4వేలు, సరుకు ఎత్తినందుకు, దించినందుకు చెక్కుకురూ. 100లు చార్జీ లు వేశారని మరలా తిరిగి వాటిని ట్రాక్టర్లోకి ఎత్తినం దుకు రూ.20 చార్జి వేశారు. ఈ రిటర్న్ వేసిన చెక్కులు వేరే వారు కొనడానికి వెనుకాడ తారని ఈ పొగాకు ఏమి చేయాలో తెలియటం లేదు.

- అమరనేని వెంకటేశ్వర్లు, రైతు, రంగప్ప నాయుడు పాలెం, స్వర్ణ, కారం చెడు మండలం.

ఎప్పుడూ ఇంత దారుణం లేదు



పొగాకు కొనుగోలు ఏ సం వత్సరము లేనంత దారుణంగా ఉం ది నేను కూడా ఈ సంవ త్సరము రెండు ఎకరాల్లో పొగాకు సాగుచేశా. సుమారుగా 22 చెక్కులు ఈ కం పెనీ వారు తీసుకు రమ్మంటే సిద్ధం చేశా. వాటిల్లో 15 చెక్కులకు మాత్రమే గేట్ పాస్ గురువారం నాటికి ఇచ్చారు. మిగిలిన వాటికి ఇవ్వలేదు.

- రవి, రంగప్ప నాయుడు పాలెం, స్వర్ణ, కారం చెడు మండలం

నాగార్జున కొండను అభివృద్ధి చేయండి

ప్రజాశక్తి-విజయపురిసౌత్



మద్కరుకు వినతిపత్రం ఇస్తున్న జాస్తి వీరాంజనేయులు

ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునకొండ మ్యూజియంను అభివృద్ధి చేయాలని అఖిలభారత పంచాయితీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపా ధ్యక్షుడు, అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనే యులు బుధవారం భారత ప్రభుత్వ కేంద్ర పురావస్తు శాఖ అదనపు డైరెక్టర్ జనరల్ ఆనంద్ మద్కరు ను ఢిల్లీలో కలిసి విజ్ఞప్తి చేశారు. దేశ విదేశాల పర్యా టకులు ఈ మ్యూజియంను సందర్శిస్తున్నారన్నారు. గైడ్స్ సదు పాయం లేకపోవటం వలన ఈ ప్రాంతాల చరిత్రను తెలుసు కోలేకపోతు న్నారన్నారు. ఈ మ్యూజియంలో డిస్ప్లే బోర్డ్స్, లైటింగ్ గ్యాలరీల ను అభివృద్ధి చేయాలని కోరారు. దీనికి స్పందించిన డైరెక్టర్ జనరల్ ఆనంద్ మద్కర్ మ్యూజియం అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని త్వరలో తగు అభివృద్ధి చర్యలు చేపడతామని చెప్పినట్లు జాస్తి వీరాంజనేయులు తెలిపారు.



పని ప్రదేశాన్ని పరిశీస్తున్న కార్మిక సంఘ శ్రీవలయి

'ఉపాధి' పని ప్రదేశాలను సందర్శించిన వ్యవసాయ కార్మిక నాయకులు

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని లింగారావుపాలెంలో ఉపాధి హామీ పని ప్రదేశాలను వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సంఘం పల్నాడు జిల్లా అధ్య క్షులు కె.రోశయ్య, నాయకులు బి.గురుస్వామి మాట్లాడుతూ పని అడిగిన కూలీలందరికీ పనులు కల్పించాలని, పని ప్రదే శాల్లో సదుపాయాలు కల్పించాలని కోరారు. చేసిన పనికి పెండింగ్ లేకుండా కూలి చెల్లించాలన్నారు.



సమ్మెలో పాల్గొన్న సిహెచ్‌ఓలు

కొనసాగుతున్న సిహెచ్‌ఒల సమ్మె

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గత 2 ఏళ్లుగా జీతభత్యాల విషయంలో ఎన్నో సమస్యల ను ఎదుర్కొంటున్నామని, తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం స్థానిక గాంధీ పార్క్ వద్ద వైద్య ఆరోగ్యశాఖ లోని ఎన్ హెచ్ ఎంల వద్ద పని చేస్తున్న సిహెచ్ఓ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమం బుధవారం 3 రోజుకి చేరింది. ఈ సందర్భంగా సిహెచ్‌ఓ నాయకులు సాగర్, కమల మాట్లాడుతూ గత ఆరేళ్లుగా సిహెచ్‌ఓ లను క్రమంబద్ధికరిం చాలని, ఎన్ హెచ్ ఎం లోని ఇతర ఉద్యోగులతో సమానంగా 23 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని, ప్రతి నెల శాలరీతో పాటు ఇన్సెంటివ్ ఇవ్వాలన్నారు. ఆర్థికమైన, ఆర్థికేతర సమస్యలను తీర్చే విధంగా హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో సి హెచ్ ఓ నాయకులు విందోద్, కె. రాము, మస్తాన్ వలి, బి. సాగర్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఎలను నిరాశపర్చిన కూటమి ప్రభుత్వం

- జీతాల పెంపు, ప్రమోషన్ల కల్పనలో నిర్లక్ష్యం
- సమస్యలపై పల్నాడు కలెక్టరేట్ ఎదుట ధర్నా - వినతి



కలెక్టరేట్‌లో ఏఓ శివలీలకు వినతిపత్రం ఇస్తున్న వీఆర్‌ఎలు, సంఘం నాయకులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రెవెన్యూ వ్యవస్థలో కీలకంగా పనిచేస్తూ, ప్రజలతో నిత్య సంబంధాలు కలిగి ఉన్న గ్రామ రెవిన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించడంలో నాటి నేటి ప్రభుత్వాలు నిర్ల క్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఏపి గ్రామ రెవిన్యూ సహా య కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమా మహేశ్వర రావు అన్నారు. సంఘం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం కలెక్టరేట్ వద్ద సామూహిక రాయబారం, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రెవిన్యూ వ్యవస్థలో సుదీర్ఘ కాలంగా పని చేస్తున్న 20 వేల మంది గ్రామ రెవెన్యూ సహాయకులు చాలీచాలని వేతనాలతో పని చేస్తున్న వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితి మరింత దయనీయంగా మారిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక వేతనాలు పెరుగు తాయని, పదోన్నతులు అమలు చేస్తారని ఆశించి భంగ పడ్డారన్నారు. వీఆర్‌ఎలకు నిబంధనలకు విరుద్ధంగా నైట్ వాచ్మెన్, అటెండర్ డ్యూటీలు వేశారన్నారు. రీసర్వే పేరుతో ఇతర ప్రాంతాలకు వెళ్లి పని చేయాల్సి వస్తుందని టిఏ, డిఏ లు అమలు చేయడం లేదన్నారు. అదనపు పని భారానికి ఆర్థిక సమస్యలు కూడా తోడవడంతో వీఆర్‌ఎల కుటుం బాలు పస్తులతో గడపాల్సిన స్థితికి నెట్టబడ్డా యన్నారు. సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనే యులు నాయక్ మాట్లాడుతూ విఆర్ఏ లకు ఎనిమేళ్లుగా వేతనాలు పెరగలేదన్నారు. అర్హులైన విఆర్ఏ లు పదోన్నతి వస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నారని పదోన్నతి కోసం ఎదురు చూస్తున్న వీఆర్‌ఎలకు వయో భారం పెరుగుతోందన్నారు. దళిత, గిరిజన మైనార్టీ,బడుగు బలహీన వర్గాలకు చెందిన వీఆర్‌ఎల కుటుంబాలను ఆదుకోవాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్షులు బందగీ సాహెబ్ మాట్లాడుతూ అక్రమ డ్యూటీలను రద్దు చేసి, వాచ్మెన్లు, అటెండర్లు ఎక్కడైతే అవసరమో అక్కడ సీనియారిటీ ఉన్న విఆర్‌ఎలను శాశ్వత ప్రాతిపదికన నియమించా లన్నారు. గ్రామ రెవెన్యూ సహాయకులకు తక్షణమే పేస్కేలు అమలు, అర్హులైన వీఆర్‌ఎలకు వీఆర్వో గా పదోన్నతి ఏళ్ల తరబడి నామినీలుగా పని చేస్తున్న వారిని వీఆర్‌ఎలుగా నియమించాలని, అటెండర్, నైట్ వాచ్మెన్ ప్రమోషన్ కోటాను 20 శాతం, నుండి 70 శాతానికి పెంచాలన్నారు. అక్రమ విధులు రద్దు చేయాలన్నారు. అనంతరం కోటప్పకొండ రోడ్డులోని సిఐటియు కార్యాలయంలలో జిల్లా గ్రామ రెవెన్యూ సహాయకుల ముఖ్య నాయ కు లతో విస్తృత సమావేశం జరిగింది. వీఆర్ఏల సమస్యలు, భవిష్యత్తు కార్యక్రమాలు, రాష్ట్ర మహాసభలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనందరాజు, సత్తనపల్లి డివిజన్ ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, నరసరావుపేట డివిజన్ అధ్యక్షులు ఆనంద్ కుమార్, సిఐటియు నాయకులు సిలార్ మసూద్, అధిక సంఖ్యలో గ్రామ రెవెన్యూ సహాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కె.ఉమామహేశ్వరరావు



రెండు పూటలా మస్టర్ విధానాన్ని ఆపాలి

ఉపాధి హామీ పనులపై వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి -ఫిరంగిపురం

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉపాధి కార్మికులకు రెండు పూటలా మస్టర్ వేసే విధానాన్ని ఆపివేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు డిమాండ్ చేశారు. బుధవారం ఫిరంగిపురం మండలంలోని పొనుగుపాడు గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, సిఐటియు ఫిరంగిపురం మండల కార్యదర్శి ఎస్కె మస్తాన్ వలీలు ఉపాధి హామీ పని ప్రదేశాన్ని పరిశీలించి ఉపాధి హామీ కార్మికులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ కార్మికులు అనేక సమస్యలను నాయకులు దృష్టికి తీసుకొచ్చారు. వారు మాట్లాడుతూ నెలలు తరబడి వేతనాలు రాకపోవడం వల్ల ఉపాధి పని వల్ల ఆసక్తి తగ్గి వేరే పనులకు వెళ్తున్నారని తెలిపారు. అలాగే రెండు పూటల మస్టర్ వల్ల ఎండలో మరల నాలుగు కిలోమీటర్లు పని ప్రదేశానికి రావాల్సిన పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గతంలో ఇచ్చే మౌలిక సదుపాయాలు కూడా



కార్మికుల సమస్యలు తెలుసుకుంటున్న ఈమని అప్పారావు

ఆపివేశారని, ఈ విషయం అధికారులను ప్రశ్నిస్తుంటే మీకు ఇచ్చే అన్ని సదుపాయాలు కనీస వేతనంలోనే ఉంటున్నాయని మాయమాటలు చెబుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఈమని అప్పారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేసేందుకు కుట్రలు చేస్తుందని దానిలో భాగమే రెండు పూటలా పని విధానాన్ని అమలు చేయడానికి ప్రయత్నం చేస్తుందని తెలిపారు. ఉపాధి కార్మికులలో వ్యతిరేకత వ్యక్తం అయ్యేటప్పటికీ రెండు పూటల మాస్టర్ విధానాన్ని తీసుకువచ్చి అమలు చేస్తున్నారని ఇది సరైనది కాదని దీనివల్ల సర్వర్లు పనిచేయక ఎండలోనే కార్మికులు పనిచేసిన తర్వాత కూడా గంటల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి వస్తుందని తెలిపారు. అలాగే కనీస వేతనం 307 రూపాయలు ఎక్కడా అమలు జరగటం లేదని కేవలం 200 నుండి 250 రూపాయలు మధ్యలోనే వేతనం పడుతుందని అది కూడా సరైన టైమ్ కు రావడం లేదని తెలిపారు. మే 5వ తేదీలోపు బిల్లులు పడకపోతే ఐదో తేదీన అన్ని మండల కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని దీనిలో ఉపాధి కార్మికులు పెద్ద ఎత్తున పాల్గనాలని పిలుపునిచ్చారు. ఎండల తీవ్రంగా ఉండడం వల్ల వడదెబ్బ తగిలి ఉపాధి కార్మికులు అనారోగ్యానికి గురికావాల్సిన పరిస్థితులు వస్తున్నాయని వారికి వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోటేశ్వర రావు పాల్గొన్నారు.



పారిశ్రామికవేత్త సరికొండ రామరాజుకు బెస్ట్ బిజినెస్ మెన్ అవార్డు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి -తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి యర్రబాలెం పారిశ్రామిక వాడకు చెందిన పారిశ్రామికవేత్త సరికొండ రామరాజు బెస్ట్ బిజినెస్ మెన్ అవార్డు అందుకున్నారు. ప్రెస్ క్లబ్ వెల్ఫేర్ వరల్డ్ వైడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన 40 మంది ప్రముఖులకు బుధవారం విశాఖపట్టణం లైబ్రరీ హాల్ లో జరిగిన కార్యక్రమంలో అవార్డులు అందజేశారు. అందులో భాగంగా పారిశ్రామిక వేత్త సరికొండ రామరాజు ఫౌండేషన్ జనరల్ సెక్రటరీ ఔకట్ కుమార్, అనన్య సాయుల చేతుల మీదుగా బెస్ట్ బిజినెస్ మ్యాన్ అవార్డును అందుకున్నారు. బెస్ట్ బిజినెస్ మ్యాన్ అవార్డు అందుకున్న పారిశ్రామిక వేత్త రామరాజుకు పలువురు అభినందనలు తెలిపారు.



పాఠశాల పూర్వ విద్యార్థి, వ్యాయామ ఉపాధ్యములు అంజిరెడ్డిని సత్కరిస్తున్న జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్

ప్రతి ఒక్కరూ దాతృత్వం కలిగి ఉండాలి

ప్రజాశక్తి - పెదకాకాని

ప్రతి ఒక్కరు దాతఅత్వం కలిగి ఉండాలని జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ కత్తెర హెని క్రిస్టీనా అన్నారు. బుధవారం మండల పరిధిలోని నంబూరు గ్రామంలోని శ్రీ పోలయ్య వేమన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల పూర్వ విద్యార్థులు నిర్మించిన ప్లాటినం జూబ్లీ భవన ప్రారంభోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. భవన ప్రారంభోత్సవ అనంతర సభలో ఆమె మాట్లాడుతూ పాఠశాల స్థాపించి 75 సంవత్సరాలు గడుస్తున్న ఇక్కడ ఉన్న ప్రతి విద్యార్థి కూడా పాఠశాలపై చూపించిన ప్రేమ ఆధార అభిమానాలు ఎనలేనివి అన్నారు. సమాజం తమకు ఏమి చేస్తుంది అనే విధంగా కాకుండా ప్రతి ఒక్కరూ సమాజానికి శ్రేయస్సును అందించే విధంగా అడుగులు వేయాలన్నారు. నంబూరు పూర్వ విద్యార్థులను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్క విద్యార్థి కూడా తమ తమ పాఠశాలలకు సహాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ బోయపాటి శంకరరావు ఎంఈఓలు జి.సత్యనారాయణమూర్తి, వి.శంకర రాజు పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు ఈమని ప్రతాపరెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ నంబూరు నాగేశ్వరరావు, కోశాధికారి డాక్టర్ కుర్ర కృష్ణ, డాక్టర్ కూచిపూడి మోహనరావు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మే 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - మంగళగిరి

కార్మిక హక్కుల కోసం మే 20వ తేదీన దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య అన్నారు. మంగళవారం రాత్రి మంగళగిరి సీఐటీయూ కార్యాలయంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ విస్తృత సమావేశం జరిగింది. సమావేశంలో ఎస్.ఎస్.చెంగయ్య మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలు పోరాటం చేసి కార్మికులు సాధించుకున్న చట్టాలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కాల రాసిందని విమర్శించారు. మరల ఎనిమిది గంటల పని దినం కోసం పోరాటం చేయవలసిన అవసరం ఉందని అన్నారు. అన్ని రంగాల కార్మికులు శ్రమదోపిడికి గురవుతున్నారని అన్నారు. మే ఒకటో తేదీన అన్ని కార్మిక వాడల్లో మేడే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని కోరారు. సిఐటియు నాయకులు వి.వి. జవహర్‌లాల్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ పేరుతో ఉద్యోగాలు ఇచ్చి శ్రమ దోపిడీ చేస్తున్నారని అన్నారు. అనంతరం



మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ నూతన కార్యవర్గం

మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షురాలుగా ఎం.వెంకటేశ్వరమ్మ, కార్యదర్శిగా వై.మంగయ్య, ఉపాధ్యక్షులుగా డి.సాంబయ్య, ఆర్.కుమారి, ఎం.శ్రీను, సహాయ కార్యదర్శులుగా కె.శ్రీనివాసరావు, ఎం. నాగార్జున, ఎన్.వెంకటేశ్వర్లు మరో 23 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం.బాలాజీ, సిఐటియు నాయకులు టి.శ్రీరాములు, వై.కమలాకర్ పాల్గొన్నారు.



అడిషనల్ కమిషనర్‌కు సార్వత్రిక సమ్మె నోటీసు అందజేత

ప్రజాశక్తి - మంగళగిరి

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా ఈనెల 20వ తేదీన జరిగే సార్వత్రిక జరిగే సమ్మె నోటీసు ను బుధవారం సాయంత్రం సిఐటియు, ఏఐటీయూసీ నాయకులు కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ కె.శకుంతల ను కలిసి సమ్మె నోటీస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎస్.ఎస్. చెంగయ్య, వి.వి.జవహర్‌లాల్, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షురాలు ఎం.వెంకటేశ్వర్లమ్మ, ఏఐటీయూసీ నాయకులు అన్నవరపు ప్రభాకర్, జి.దుర్గారావు, బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



నిర్మల ఫార్మసీ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఆత్మకూరు నిర్మల ఫార్మసీ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పాముల రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ దేశీయ ఫార్మా సంస్థ కంపెనీ ప్రాంగణ ఎంపికలు నిర్వహించిందని ఎంపికలలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ఫార్మసీ కళాశాలలో నుండి 150 మంది విద్యార్థులు హాజరైనట్లు చెప్పారు. తొలుత వారికి రాత పరీక్ష నిర్వహించడం జరిగిందని, అనంతరం 128 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగిందన్నారు. ఎంపికైన విద్యార్థులకు వారం రోజుల్లో నియామక పత్రాలు అందిస్తామని హెటిరో కంపెనీ ప్రతినిధి కె.సమీర్ కుమార్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ సిస్టర్ జి.నిర్మల జ్యోతి అభినందించారు.



తెలంగాణ టెన్త్ ఫలితాల్లో భాష్యం విజయభేరి

ప్రజాశక్తి - గుంటూరు

తెలంగాణ ఎస్ఎస్‌సి ఫలితాల్లో భాష్యం విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపారని హైదరాబాద్ భాష్యం జెడ్ఇఒ శిరీష తెలిపారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో హైదరాబాద్ నుండి మా విద్యార్థి బి.సూర్యరిషి 600 మార్కులకుగాను 593 మార్కులు సాధించి, అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడన్నారు. అలాగే జె.ఆదిత్య 592, వై.నమ్రతసాయి 590, పి.బాలు 590, కె.అభిజ్ఞ 590 మార్కులు సాధించారన్నారు. 580 ఆపైగా మార్కులను 103 మంది, 570 ఆపైగా మార్కులు 278 మంది, 550 ఆపైగా 708 మంది, 500ల మార్కులకుపైగా 1669 మంది సాధించారన్నారు. శిరీష మాట్లాడుతూ తెలంగాణ ఎస్ఎస్‌సి ఫలితాల్లో భాష్యం విద్యార్థులు రికార్డ్ సృష్టించారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఛైర్మన్ రామకృష్ణ, వైస్ ఛైర్మన్ హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ సాకేత్‌రామ్ అభినందించారు.

'లైఫ్ ఆఫ్ కర్మయోగి - మెమరీస్ ఆఫ్ ఏ సివిల్ సర్వెంట్'పై చర్చా వేదిక



ప్రజాశక్తి - ఎఎన్‌యు

తక్షశిల ఐఎఎస్ అకాడమీ మరియు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో, "లైఫ్ ఆఫ్ కర్మయోగి - మెమరీస్ ఆఫ్ ఏ సివిల్ సర్వెంట్" పుస్తకంపై చర్చా కార్యక్రమం బుధవారం విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ పుస్తకాన్ని రచించిన ఎం. గోపాలకఅష్ణ ఐఎఎస్ (రిటైర్డ్) సివిల్ సర్వెంట్‌గా తన జీవిత అనుభవాల ఆధారంగా రచించిన పుస్తకంపై జరిగిన చర్చలో సీనియర్ ఉద్యోగులు, విద్యావేత్తలు, సివిల్ సర్వీసెస్ ఆశావహులు పాల్గొన్నారు. ప్రజాసేవా భావన, నైతిక పరిపాలన, ఆచరణాత్మక నాయకత్వం వంటి అంశాలపై అర్థవంతమైన చర్చ సాగింది. ప్రధాన అతిథిగా హాజరైన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ) ఎం.టి. కఅష్ణబాబు మాట్లాడుతూ, ఈ పుస్తకం ఒక అసాధారణమైన, నిజాయితీతో కూడిన వ్యాసంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇది ప్రస్తుత అధికారులకు మరియు భవిష్యత్తు సివిల్ సర్వీసు ఆశావహులకు ప్రేరణనిచ్చే గ్రంథమని అభిప్రాయపడ్డారు. ఆయన భారత పరిపాలనా సేవలలో చేసిన విశిష్ట సేవ, ప్రజాకేంద్రీకఅత పరిపాలన పట్ల ఉన్న నిబద్ధతను ప్రస్తావించారు. తక్షశిల ఐఎఎస్ అకాడమీ చీఫ్ పేట్రన్, మాజీ ప్రిన్సిపల్ సెక్రటరీ వి.ఎన్. విష్ణు, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రెక్టర్ ప్రొఫెసర్ కె. రత్న శీల మణి, యూనివర్శిటీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం. సురేశ్ కుమార్, తక్షశిల ఐఎఎస్ అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ బి.ఎస్.ఎన్. దుర్గాప్రసాద్ ప్రసంగించారు. ఈ కార్యక్రమం ఒక పుస్తకం చర్చగా మాత్రమే కాకుండా, ప్రజాసేవా స్ఫూర్తిని కొత్త తరం లోకి బలంగా బోధించే ఒక వినూత్న వేదికగా నిలిచింది.



మహాత్మా బసవేశ్వరకు నివాళి అర్పిస్తున్న కలెక్టర్, జెసి, తదితరులు

మహాత్మా బసవేశ్వరకు ఘన నివాళి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మూఢనమ్మకాలు బలంగా ఉన్న రోజుల్లో తన బోధనల ద్వారా ప్రజలను మూఢ నమ్మకాలు, ఆచారాలు నుండి మహాత్మ బస వేశ్వర కాపాడారని కలెక్టర్ పి.అరుణ్ బాబు అన్నారు. నరసరావుపేట కలెక్టరేట్‌లో బుధవారం మహాత్మ బసవే శ్వర 894వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. బసవే శ్వర చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మహాత్మ బసవేశ్వర జయంతి వేడుకలను నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. సమాజంలో వేళ్లునికిపోయిన కుల, వర్ణ, లింగ వివక్షతకు వ్యతిరేకంగా పోరాటం చేస్తూనే సమానత్వాన్ని బోధించిన అభ్యుదయ వాది మహాత్మ బసవేశ్వర జయంతిని ప్రభుత్వ సారధ్యంలో నిర్వహిం చడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరె దనుంజయ్, జిల్లా రెవిన్యూ అధికారి ఇ. మురళి జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దేశం కోసం త్యాగాలకు సిద్ధం ఎమ్మెల్యే జూలకంటి

ప్రజాశక్తి - మాచర్ల :

దేశం కోసం ఎటువంటి త్యాగాలకైనా సిద్ధమని, దేశ రక్షణ కోసం, దేశ సార్వభౌమత్వాన్ని కాపాడటానికై ప్రధాని నరేంద్ర మోడీ ఏ నిర్ణయం తీసుకున్న కట్టుబడి ఉంటామని మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానంద రెడ్డి అన్నారు. మంగళ వారం నెహ్రూ నగర్ లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విస్తృత స్థాయీ సమావేశంలో పాల్గొని మాట్లా డారు. పెహల్గామ ఉగ్రదాడిని యావత్ ప్రపంచం తీవ్రంగా ఖండిస్తుందని, ఇంతటి క్రూరదాడులకు పాల్పడిన ఉగ్రవాదుల ను ప్రపంచంలో ఏమూలన దాక్కున్నా ఏరివేయాల న్నారు. ఉగ్ర దాడిలో అమరలైనవారికి నాయకులు, కార్యకర్తలతో కలిసి రెండు నిమిషాలు మౌనంపాటించి, నివాళులర్పించారు.


కుట్టుమిషన్ శిక్షణా ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే, తదితరులు

డ్వాక్రా మహిళలకు కోరినంత రుణం : ప్రత్తిపాటి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

శక్తియుక్తులే మహిళలకు మేలైన ఆభరణాలని నేర్చుకున్న విద్యల్లో రాణించి అనుకున్న లక్ష్యాలను సాధించాలని శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు బుధవారం అన్నారు. పట్టణం లోని సుభానీ నగర్‌లోని ముస్లిం కమ్యూనిటీ హాల్‌లో రాష్ట్ర బీసీ, ఈ.డబ్ల్యూ.ఎస్ కార్పొరేషన్లు సంయుక్తంగా మహిళల కోసం ని ర్వహిస్తున్న కుట్టుమిషన్ ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబాలను చక్కదిద్దడంలో నిష్ణాతులైన మహిళలు, తమకు న చ్చిన వత్తుల్లో కూడా అంతకంటే మిన్నగా అందరూ మెచ్చేలా ఎదగా లన్నారు. శిక్షణకు వచ్చిన మహిళలతో మాట్లాడిన ఆయన త్వరలోనే కూటమి ప్రభుత్వం డ్వాక్రామహిళల రుణాల లక్ష్యాన్ని పెంచనుందని, స్వయం ఉపాధి రంగాల్లో రాణిం చాల ను కునే మహిళలకు విరివిగా రుణాలు అందించాలనే ఆలోచన చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో నాయకు లు నెల్లూరి సదాశివరావు, షేక్ టీడీపీ కరీముల్లా, పఠాన్ సమద్ ఖాన్, జవ్వాజి మధన్ మోహన్, మద్దుమాల రవి, కందుల రమణ, శిక్షకురాలు అనితా భాయి, మహిళ నాయకులు, టీడీపీ నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై కౌన్సిల్‌లో చర్చ


చైర్మన్ షేక్ రఫాని


సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిల్ సభ్యుడు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మున్సిపల్ సమావేశం సాదాసీదాగా ముగిసింది. స్థానిక మున్సిలప్ కౌన్సిల్ హాలులో చైర్మన్ షేక్ రఫాని అధ్యక్షతన బుధవారం మొదలైన సమావేశంలో కౌన్సిల్ సభ్యుడు బేరింగ్ మౌలాలి ప్రతిపాదన మేరకు పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడిలో అశువులు బాసిన వారికి సంతాపంగా ఒక నిమిషం మౌనం పాటించారు. అనంతరం ఎజెండాలోని 37 అంశా లను ఆమోదించారు. బేరింగ్ మౌలాలి మాట్లాడుతూ పట్టణంలోని పలు ప్రాంతాల్లో బస్ షల్టర్లు ఏర్పాటు చేయడంపై హర్షణీయ మన్నారు. ఈ అంశంపై పలు సూచనలు చేశారు. పట్టణంలోని కేబీరోడ్డుతో పాటు మిగిలిన ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగించాలని, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి శిలాఫలా కాలు ఏర్పాటు చేయాలని కోరారు. కొన్ని ప్రాంతాల్లో తాగునీరు రంగు మారి వస్తుందని అధికా రుల దృష్టికి తెచ్చారు. వైస్‌చైర్మన్ వలేటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పట్టణంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, పండరీపురంలో సైతం తాగునీటి సమస్య తలెత్త డం శోచనీయమని, ఇదే అంశంపై ఎమ్మెల్యే ప్రత్తి పాటి పుల్లారావు సైతం ఆగ్రహం వ్యక్తం చేశారని గుర్తు చేశారు. మరోవైపు మున్సిపాలిటి పరిధిలో భారీ వృక్షాలు నరికివేస్తు న్నారని దీనిపై అధికారులు ఎందుకు స్పందించటం లేదని ప్రశ్నించారు. టీడీపీ పక్షనాయకులు గంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో నిబంధనలు అతిక్ర మించి, కాల్వల మార్గాలను మార్చి నిర్మాణం చేసిన కట్టడంపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని మాట్లాడుతూ మున్సిపల్ సమావేశాల్లోనే కాకుం డా వార్డుల సమస్యలను కౌన్సిల్ సభ్యులు అధికారుల దృష్టికి తీసుకు రావాలని సూచించారు.

తాగునీటి సమస్యలు పరిష్కరిస్తున్నాం

తాగునీటి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి. శ్రీహరి బాబు, డీఈఈ అబ్దుల్ రహీం తెలిపారు. పట్టణంలో ఏ ప్రాంతంలోనైనా తాగునీ టి సమస్య ఉన్నట్లు ఫిర్యాదు వస్తే వెంటనే స్పందిస్తున్నట్లు వెల్లడించారు. కుళాయిల ద్వారా నీటి సర ఫరా నిలిచిపోతే నాలుగు ట్యాంకర్లు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. చెట్ల నరికి వేత విషయంపై కమిషనర్ స్పందిస్తూ గతంలో గాంధీపార్కులో టేకు చెట్టును పొరపాటును అప్పట్లో లీజుకు తీసుకున్న నర్సరీ వారు కొట్టి వేశారని, దాన్ని మున్సిపాలిటీ స్వాధీనం చేసుకుందన్నారు విశ్వనాథ థియేటర్ ఎదురు ఉన్న దశాబ్దాల నాటి రావి చెట్టును కొట్టి వేసిన వారి గురించి విచారణ చేపట్టి అనంతరం వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

పల్నాడు నుండి 800 బస్సుల్లో జనం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రేపు అమరావతి రాజధాని పున్ణ నిర్మాణ కార్యక్రమంలో పర్యటించనున్న నేపథ్యంలో పల్నాడు జిల్లా నుండి 800 బస్సులలో ప్రజలను చేరవేసే ప్రక్రియలో భాగంగా అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు ఆదేశించారు. జిల్లా అధికారులు, మండల అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తగు సూచనలు సలహాలు అంద జేశారు. ప్రతి బస్సులో మెడికల్ కిట్లతో పాటు ఒక ఆశా వర్కర్ ను కూడా ఉంచాలని సూచించారు. మంచినీరు, అల్పాహారం, భోజనం ఏర్పాటు చేయాలన్నారు. మధ్యా హ్నాం ఒంటిగంట కల్లా సభా స్థలికి చేరు కునే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవా లన్నారు. సంబంధిత డీఎస్‌ఓ, మార్కెటింగ్ శాఖ అధికారులు ప్రతి బస్సులోనూ ఇద్దరు ప్రభుత్వ సిబ్బందిని ఇన్చార్జిల్ గా ఉంచాలన్నారు. సభాస్థలి వద్ద పంచాయతీరాజ్ శాఖ సిబ్బందిని ఏర్పాటు చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వీటన్నిటికీ జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరేను నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు సంబంధిత అధికారులతో సమన్వ యం చేసుకొని కార్యక్రమాన్ని విజయవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనికి సంబంధించి రూట్ మ్యాప్ ను పంచాయతీరాజ్ శాఖ ఈ ఈ రాజా నాయక్ నిర్వహిస్తారన్నారు.కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధు లను సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటన సంబంధించి పల్నాడు జిల్లా కలెక్టరేట్లో ప్రత్యేక కాల్ సెంటర్ ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు క్షేత్రస్థాయి అధికారులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్ : మే 2న అమరావతిలో జరిగే ప్రధాని నరేంద్ర మోడీ సభను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ విజ్ఞప్తి చేశారు. సత్తెనపల్లి పట్టణంలోని రఘురాం నగర్ ప్రజావేదికలో ప్రధాని నరేంద్ర మోడి పర్యటన పై పార్టీ శ్రేణులతో విస్తత స్థాయి సమావేశం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం పరిశీలకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు తాతా జయప్రకాష్ నారాయణ కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుర్గి : ప్రధానమంత్రి బహిరంగ సభకు ప్రతి ఒక్కరు హాజరు కావాలని ఎంపీడీవో శివ ప్రసాద్ బుధవారం తెలిపారు. మండల అభివద్ధి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ దుర్గి మండలం నుండి 10 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందని ఫీల్డ్ అసిస్టెంట్లు సూపర్వైజర్లు బాధ్యతగా తీసుకొని ప్రజలను అధిక సంఖ్యలో హాజరు అయ్యేలా చూడాలని అన్నారు. బహిరంగ సభకు గర్భిణీ స్త్రీలు 50 ఏళ్ల పైబడిన వద్ధులు పిల్లలను తీసుకొని రావద్దని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఎంపీపీ సునీత సాయి శంకర్ ,తహసిల్దార్ ఫణీంద్ర కుమార్, ఇ వో పి ర్ డి సత్య ప్రసాద్ ఏపీవో మల్లికార్జునరావు, వెలుగు సీసీలు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది, సచివాలయ అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.ప్రధాని

రాష్ట్రస్థాయి పరుగు పోటీల్లో ఆకాంక్షకు ప్రథమ స్థానం

ప్రజాశక్తి- రెంటచింతల



అండర్ -14 సీనియర్స్ విభాగంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన 100 మీటర్ల పరుగు పందెం పోటీల్లో ఎన్. ఆకాంక్ష ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నట్లు శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపల్ అన్నపురెడ్డి హరిణి తెలిపారు. డాక్టర్ బిఎస్‌ఆర్ మెమోరియల్ స్పోర్ట్స్ మీట్‌లోభాగంగా బుధవారం ఉదయం విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించిన పరుగుపందెం పోటీల్లో 23 జిల్లాల నుంచి 23 గురు క్రీడాకారులు పాల్గొనగా ఆకాంక్ష ప్రథమ స్థానంలో నిలిచింది 15రోజుల కిందట జిల్లా స్థాయిలో పరుగు పందెం పోటీలు నరసరావుపేటలో నిర్వహించగా ఆకాంక్ష మొదటి స్థానంలో నిలబడడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది త్వరలో దక్షిణాది రాష్ట్రా ల పోటీలు హైదరాబాదులో నిర్వహించనున్నారు ఆకాంక్ష తండ్రి అమర్నాథ్ రెడ్డి టైల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో పని చేస్తున్నారు ఆకాంక్ష మెరిట్ అవార్డును శ్రీ చైతన్య స్కూల్ యాజమాన్యం అందజేసింది.

షర్మిలా అక్రమ గృహ నిర్బంధం హక్కులను హరించడమే : కాంగ్రెస్

ప్రజాశక్తి-చిలకలూరిపేట

రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు వైయస్ షర్మిలని అక్రమ గృహ నిర్బంధాన్ని చిలకలూరిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమ న్వయకర్త రాధాకృష్ణ ఖండించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యా లయంలో బుధవారం జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజాస్వా మ్యాన్ని ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను, మహిళా హక్కులను కాలరాస్తుందనడానికి షర్మిల అక్రమ గృహ నిర్బంధం ప్రత్యక్ష నిదర్శనమని అన్నారు. అమరావతి రాజధాని నిర్మాణం ఐదు కోట్ల ఆంధ్ర ప్రజలకు సంబంధించిన అంశం కనుక ఆంధ్ర బిజెపి కి ప్రతిపక్షంగా ఉన్న భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షు రాలుగా రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలను ప్రశ్నించే హక్కు షర్మిలకి ఉందన్నారు. ఈ పదేళ్లలో అమరావతి రాజధాని నిర్మా ణం పూర్తి చేయడం కోసం కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఏమాత్రం సహకరించకపోగా మొండి చేయి చూపిం దన్నారు. ఆంధ్ర బిజెపికి ప్రతిపక్షంగా వ్యవహరిస్తున్న భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకురాలిని అక్రమ గృహ నిర్బధానికి గురి చేయడం మహిళా హక్కులను హరించడమేనన్నారు. అందుకు పదింతలుగా ఉవ్వెత్తున ఎగసిపడే కెరటంలా ప్రజలలోకి ఎన్డీఏ కూటమి వైఫల్యాలను తీసుకువెళతామని మీకు తగిన గుణ పాఠం చెబుతామని రాధాకృష్ణ హెచ్చరించారు.

నీతి కథలు చదివిన విద్యార్థులు

ప్రజాశక్తి - మాచర్ల రూరల్ : పట్టణంలోని మాచర్ల శాఖ గ్రంథాలయంలో 3వ రోజు బుధవారం కథలు చదివే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో జిల్లా పరిషత్ బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జడ్పీ గర్ల్స్ హై స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్పీ బాయ్స్ హై స్కూల్ ఉపాధ్యాయులు టీ.శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్ జరిగే 40 రోజులు ప్రతి ఆదివా రం వుయ్ లవ్ రీడింగ్ కార్యక్రమంలో తప్పకుండా విద్యార్థులు పాల్గొనాలని కోరారు. గ్రంథాలయంలో మంచి పుస్తకాలున్నా యని, వాటిని చదివి విజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. గ్రంథాలయ అధికారి కె.ఫణిభూషణ్ ఆధ్వర్యంలో కార్యక్రమం లో విద్యార్థులు పాల్గొని నీతి కథలు చదివారు.

నిధులపై శ్వేత పత్రం విడుదల చేయాలి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - మాచర్ల రూరల్ :

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎన్ని నిధులు ఇచ్చిందో, రాష్ట్ర ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ఇచ్చిన నిధుల్లో గ్రాంటు ఎంత? రుణాలు ఎంత? అనేది ప్రజలకు వివరంగా తెలియపరచాలని కోరారు. రాష్ట్ర రాజధాని అమరావతి మొదటి సారి శంకుస్థాపన సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మట్టి,నీరు ఇచ్చా రని, రెండోవ మారు శంఖుస్థాపన చేస్తున్న ప్రధాని మోడీ ఈ సారి ఏమిస్తారోనని రాష్ట్ర ప్రజలు ఆతృతగా ఎదురు చూస్తున్నారని ఎద్దేవా చేశారు. చిత్తశుద్ధి వుంటే విభజన హామీలు అమలు చేయాలన్నారు.

ప్రజాశక్తి 7
గుంటూరు జిల్లా
గురువారం 1 మే 2025

మితిమీరుతున్న మందుబాబుల ఆగడాలు

ఎక్కడ చూసినా మద్యం, బీరు సీసాలే

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

రోజు రోజుకి మందుబాబుల ఆగడాలు మితిమీరుతున్నాయి. ఏ పంట పొలాలలో చూసిన మందు బీరు సీసాలే దర్శనమిస్తున్నాయి. ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి పొలిమేర డొంకలలో, పచ్చని పంట పొలాలలో, పొలాలకు వెళ్లే రోడ్ల పైనే బాహాటంగానే మద్యం సేవిస్తూ, నానా యాగి చేస్తున్నారు మద్యం ప్రియులు. పొలాలలో ఎక్కడ చూసిన మందు, బీరు సీసాలే కుప్పలు తెప్పలుగా దర్శనమిస్తున్నాయి. ఉదయాన్నే పొలాలకు వచ్చిన రైతులకు పగిలిన బీరు సీసాలు, ప్లాస్టిక్ గ్లాసులు చిందరవందరగా పడి ఉండడంతో రైతుల గగ్గోలు పెడుతున్నారు. రాత్రి వేళలో ఆకతాయిలు పార్టీల పేరుతో ఆకుకూరల మడులలో, అరటి తోటలలో మద్యం సీసాలతో చెలరేగిపోతున్నారు. ఒక్కొక్క చోట పదుల సంఖ్యలో పగిలిన మద్యం సీసాలు దర్శనం ఇవ్వడంతో సేద్యం చేసే రైతులు ఆందోళన చెందుతున్నారు. పడి ఉన్న సీసాలను ఏరి బయట పారవేయాల్సిన పరిస్థితి. పగిలిన గాజు సీసాల పెంకులు రైతుల, వ్యవసాయ కూలీల కాళ్లకు గుచ్చుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం నేరమని పోలీసులు ఎన్ని హెచ్చరికలు జారీ చేసిన, మందుబాబులకు కౌన్సిలింగ్ ఇచ్చిన అలవాటు పడిన మద్యం ప్రియులు పోలీసులు హెచ్చరికలను పెడచెవిన పెడుతున్నారు. కుంచనపల్లి గ్రామ పరిధిలో మూడు బార్ అండ్ రెస్టారెంట్లు ఉండడం మందుబాబుల ఆగడాలకు రాత్రి పగలు తేడా లేకుండా పోతుంది. మద్యం మత్తులో పంట పొలాలను సైతం తొక్కిమరి పాడు చేస్తున్నారు. మద్యానికి బానిసలైన యువకులతో పాటు, యువతులు కూడా గ్రామ పొలిమేర డొంకలలో మద్యం సేవిస్తూ, విచ్చలవిడిగా సిగరెట్లు తాగుతూ ఊగుతూ దర్శనమిస్తున్నారని పలువురు రైతులు వాపోతున్నారు. జాతీయ రహదారికి దగ్గరగా ఉన్న కుంచనపల్లి పచ్చని పంట పొలాల ఆహ్లాదకరమైన వాతావరణం మద్యం ప్రియులను మరింత ఆకర్షిస్తుంది. నేటి యువత మద్యం, డ్రగ్స్ కు అలవాటు పడి దుర వ్యసనాలతో బంగారు భవిష్యత్తును, ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారు. సంబంధిత పోలీసులు హెచ్చరికలు జారీ చేయడమే కాక, రాత్రి వేళలో బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న వారిని పట్టుకుని, కఠినంగా శిక్షించాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.





146వ రోజుకు ఎసిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లి

ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావలసిన బకాయిల కోసం చేస్తున్న దీక్షలు బుధవారం నాటికి 146 రోజుకు చేరు కున్నాయి. దీక్షలో సిహెచ్ పిచ్చయ్య, ఎండి ఇస్మాయిల్, ఎం గురవయ్య, వై సాంబశి వరావు, కే ఆదినారాయణ కూర్చున్నారు. దీక్షలను సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫ్యాక్టరీ కార్మికుల విషయం పట్ల ప్రభుత్వం అశ్రద్ధ వహించటం సరికాదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదం, బి.సూర్యప్రకాశ్రావు, వై యెహెూషువ, వై రమాదేవి, ఈ సారమ్మ, టి దుర్గ భవాని, ఎస్.కె. ఇమాంబి, డి.రమణ, యు.రమణ, వి.లక్ష్మి, డి.సువర్ణ కుమారి, ఎ.విజయశ్రీ, నాగేశ్వరరావు, ఎం.చరణ్, టి.నిశాంత్ సాయి, టి.చరిత శ్రీ ఆద్య తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగులకు జోసఫ్ కెనడీ ఆదర్శం

ప్రజాశక్తి - గుంటూరు

వృత్తిపట్ల అంకితభావంతో పనిచేసి, మంచి పేరు తెచ్చుకున్న జోసఫ్ కెనడి శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్మన్ కత్తెర హెని క్రిస్టినా ఆకాంక్షించారు. గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన సూర్యపాగ జోసఫ్ కెనడికి బుధవారం వీడ్కోలు అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమానికి పంచాయ తీరాజ్ మినీస్టీరియల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నాయ కులు డాక్టర్ కూచిపూడి మోహన్‌రావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో కె.కృష్ణ, ఎకౌంట్స్ ఆఫీసర్ పుల్లగూర శామ్యూల్‌పాల్, ఏవో రత్నబాబు, ఉద్యోగులు నాగభూ షణం, శ్రీనివాసరావు, జిలాని, సుబ్బారావు ప్రసంగించారు. అనంతరం కెనడి, లక్ష్మీప్రసన్న దంపతులను సత్కరించారు.

బిజెపిలో చేరిన మునగపాటి

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణానికి చెందిన మునగపాటి వెంకటేశ్వరరావు గుంటూరు జిల్లా బిజెపి కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు సిహెచ్ తిరుపతిరావు ఆధ్వర్యంలో బుధవారం బిజెపిలో చేరారు. కొంతమంది కార్యకర్తలతో కలిసి బిజెపిని చేరడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎడ్లపాటి స్వరూప రాణి, జె శ్రీనివాసరావు, ఆర్ భూమేశ్వరరావు, కాండ్రు భవాని తదితరులు పాల్గొన్నారు. గతంలోనే బిజెపిలో ఉండి, తర్వాత వైసిపి, టిడిపి పార్టీలో చేరారు. మరలా బిజెపి పార్టీలోకి చేరారు.

ఖనిజ సంపదను దోచిపెట్టేందుకే మావోయిస్టులపై దాడులు

ప్రజాశక్తి - మంగళగిరి



జార్ఖండ్, చత్తీస్ ఘడ్ అడవుల్లోని ఖనిజ సంపదను విదేశీయులకు దోచి పెట్టేందుకే ప్రధాని మోడీ కేంద్ర హెూమ్ శాఖ మంత్రి అమిత్ షాలు మావోయిస్టులపై దాడులు చేయిస్తున్నారని ప్రముఖ న్యాయవాది పచ్చల శ్యాంబాబు విమర్శించారు. శాంతి చర్చలకు వస్తామంటూ మావోయిస్టులు ప్రకటిస్తున్నప్పటికీ వారిని అంతమొందిం చడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన బుధవారం మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. తెలంగాణ, చత్తీస్.ఘడ్ పరిధి కర్రెగుట్టలు వద్ద ఇటీవల 38 మంది మావోయిస్టులను హతమార్చారని అన్నారు. మావోయిస్టులని అడ్డు తొలగిం చుకొని ఖనిజ సంపదను విదేశీయులకు అప్పగించాలని కుట్ర పన్నారని ఆరోపించారు. మావోయిస్టులు భారతీయులే అని అన్నారు. విదేశీ ఉగ్రవాదులను అంతమొందించాలని అంతే కానీ అమాయకులైన ఆదివాసీలను మావోయిస్టుల పేరుతో సైన్యం చేత అంతమొందించడం సరైన విధానం కాదని విమర్శించారు. పలు ఘటనలు కనీసం వెలుగులోకి కూడా రావడం లేదని అన్నారు. జీవించే హక్కులను హరించి వేస్తున్నారని తెలిపారు. మావోయిస్టు లను పిలిచి శాంతియుతంగా చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఇదే విషయాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ లు కేంద్రం దఅష్టికి తీసుకువెళ్లాలని కోరారు.

రాజధాని పున:ప్రారంభోత్సవాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి - మంగళగిరి

అమరావతి రాజధాని పున: ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మే 2వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించే ఈ కార్యక్రమంలో అమరావతిలోని 29 గ్రామాల ప్రజలతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. రైతులు 33 వేల ఎకరాలు రాజధాని నిర్మాణం కోసం ఇస్తే మహిళలు, రైతులు అని కూడా చూడకుండా వారిని కొట్టించి అక్రమ కేసులు బనాయించారన్నారు. రాజధాని తెస్తామని మంత్రి నారా లోకేష్ శబధం చేశారని, లోకేష్ మాట నిలుపుకున్నారని ఆయన అన్నారు. రాష్ట్ర సివిల్ సప్లయి కార్పొరేషన్ డైరెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న సుందర యాదవ్

తోట పార్థసారథి మాట్లాడుతూ గత ప్రభుత్వం రాజధానిలు నిర్వీర్యం చేయాలని మూడు రాజధానులను తెచ్చి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిందన్నారు. సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకులు బత్తుల నాగరాజు, కొల్లి వెంకటరామయ్య చౌదరి, రుద్రు శ్రీనివాస్, మర్రి యేసుబాబు, తెలుగు యువత నాయకులు తోట శ్రీను బాబు పాల్గొన్నారు.

ఉన్నత విద్య, సమున్నత వ్యక్తిత్వంతోనే ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

విద్యార్థులకు ఉన్నత విద్య, సమున్నత వ్యక్తిత్వంతోనే ఉజ్వల భవిష్యత్తు సాకారమవుతుందని ఐ సి సి ఆర్, మినిస్ట్రీ ఆఫ్ ఎక్ట నల్ అఫైర్స్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా డిప్యూటీ డైరెక్టర్ జనరల్ శ్రీమతి అంజు రంజన్ విద్యార్థులకు తెలియజేశారు. బుధ వారం వర్సిటీలో నిర్వహించిన కెరియర్ డెవలప్మెంట్ స్ట్రాటజీస్ ఫర్ సక్సెస్ అనే అవగాహనా సదస్సులో ఆమె కీలకోపన్యాసకురాలిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్య తర్వాత అయోమయ స్థితిలో పడొద్దనీ విద్యార్థులు నిర్దిష్టమైన లక్ష్యాలను పెట్టుకుని ఆ దిశగా తమ విద్యాభ్యాసం కొనసాగించాలని సూచించారు. విద్యార్థులు ఆంగ్ల భాష లోనే విద్యాభ్యాసం చేయాలని నియమ నిబంధనలను పెట్టుకోవద్దనీ భాష ప్రతిభను చూపే సాధనమే అని మాతృభాషలో విద్యాభ్యాసం చేయొచ్చనీ పేర్కొన్నారు.



మాట్లాడుతున్న శ్రీమతి అంజు రంజన్

విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించడంలో పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని తెలియజేశారు. అవగాహనా సదస్సులో వర్సిటీ రెక్టార్ ఆచార్య కె రత్న షీలా మణి మాట్లాడుతూ నేటి విద్యార్థులు ఉన్నత విద్యావేత్తల ద్వారా సరియైన విధంగా స్ఫూర్తి పొందాలని ఇలాంటి కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి సింహాచలం విద్యార్థులకు అవగాహన సదస్సు గురించి దిశా నిర్దేశం చేస్తూ వర్సిటీ అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. వర్సిటీ ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ సెల్ డైరెక్టర్ ఆచార్య పి పద్మావతి ఈ అవగాహన సదస్సును సమన్వయం చేశారు. ఈ సదస్సులో ఆర్ట్స్ కామర్స్ లా కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎమ్ సురేష్ కుమార్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ ప్రమీల రాణి, ఇంజినీరింగ్ కళాశాల సహాయ ప్రిన్సిపల్స్ డాక్టర్ గోపీ కఅష్ణ, డాక్టర్ చంద్రమౌళి అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఆంధ్రప్రదేశ్ కమ్మ సేవా సమాఖ్య ట్రస్ట్ ఏర్పాటు

ప్రజాశక్తి - మంగళగిరి

పట్టణంలోని రాయల్ హాల్లో బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమ్మ పెద్దల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో భవిష్యత్తు అవసరాల దఅష్ట్యా కమ్మవారి సేవ సమాఖ్య పేరిట ట్రస్టును ఏర్పాటు చేయడం జరిగింది. గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ గని భాస్కరరావు, అధ్యక్షులుగా ఎం.మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా కె రమేష్ చంద్ర, కోశాధికారిగా జి నాగ కోటేశ్వరరావు, కార్యదర్శిగా ఎస్.స్వరూప రాణిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎం జగదీష్, టీటీడీ డైరెక్టర్ ఎ.కోటేశ్వరరావు, కమ్మవారి సేవా సమితి విజయవాడ గ్రేటర్ అధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరావు, జి. రామకృష్ణ, జి శ్రీనివాస్, ఏ హనుమంతరావు, ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘం ప్రధాన కార్యదర్శి కె.రఘుపతిరావు పాల్గన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేయాలనే ఆలోచనలో ఉన్నట్లుగా సమావేశం తీర్మానించడం జరిగిందని వారు తెలిపారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

ప్రజాశక్తి - తుళ్లూరు



స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. వేసవి విజ్ఞాన శిబిరములో భాగముగా 3వ రోజు విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలతో పాటు రాజధాని అమరావతి నమూనాపై గురించి గ్రంథాలయాధికారి టి.గిరిధర్ కుమార్ అవగాహన కల్పించారు. వచ్చే నెల 6వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించడం జరుగుతుందని, విద్యార్థులలో సృజనాత్మకత, విజ్ఞానం పెంపొందించే అనేక అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలి

ప్రజాశక్తి - తుళ్లూరు



ప్రధాని నరేంద్రమోడీ రాష్ట్ర ప్రజల, అమరావతి రైతుల ఆకాంక్షలను నెరవేర్చాలని బిజెపి మండల ఉపాధ్యక్షులు సరిపూడి సాంబశివరావు కోరారు. బుధవారం తుళ్లూరులో మాట్లాడుతూ, మే2న మోడీ రాజధాని అమరావతి నిర్మాణ పనుల పున్ణ ప్రారంభానికి రావడం ఆనందదాయకమన్నారు. బిజెపి భాగస్వామ్యంతో రాష్ట్రం ప్రగతి పథంలో నడుస్తు ందని ప్రజలు భావిస్తు న్నారని, అందుకు అనుగుణంగా బిజెపి నాయకత్వం ప్రణాళి కాబద్ధంగా ముందు కెళ్లాలని కోరారు. వెలగపూడిలో జరిగే బహిరంగ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపు నిచ్చారు.

పన్ను రాయితీని వినియోగించుకున్న పులివర్తి శ్రీనివాస్‌కు మేయర్ అభినందన

ప్రజాశక్తి -గుంటూరు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ముందస్తు పన్ను ఏకమొత్తంలో చెల్లింపు ద్వారా 5 శాతం రాయితీ, పాత బకాయిల చెల్లింపు ద్వారా వడ్డీపై 50 శాతం రాయితీని న్యాయవాది పులివర్తి శ్రీనివాస్ వినియోగించు కున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అభినందించారు. పులివర్తి శ్రీనివాస్ తన వ్యక్తిగత ఆస్తులకు సంబంధించి 10 అసెస్‌మెంట్లకుగాను రూ.1.50 లక్షల పన్ను, అలాగే పాత బకాయిలను చెలించారు.



శ్రీనివాస్‌ను అభినందిస్తున్న మేయర్ కోవెలమూడి రవీంద్ర

పాలీసెట్‌కు 84.04 శాతం హాజరు

ప్రజాశక్తి- గుంటూరు

జిల్లాలో బుధవారం నిర్వహించిన పాలీసెట్ ప్రవేశ పరీక్షకు 84.04 శాతం విద్యార్థులు హాజరయ్యారు. జిల్లాలో 11 పరీక్షా కేంద్రాలలో 4055 మంది విద్యార్థులకుగాను 3408 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తంగా పరీక్ష ప్రశాంతంగా జరిగిందని, పాలీసెట్ జిల్లా కోఆర్డినేటర్, ఎంపిటిఎస్ పాలిటెక్నిక్ కాలేజి ప్రిన్సిపాల్ టి.శేఖర్ తెలియజేశారు. గుంటూరు టిజెపిఎస్ కాలేజిలోని పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు నిర్దేశిత సమయం దాటిన తర్వాత రావటంతో వారిని అనుమతించలేదు. ఉదయం 11 గంటలకు పరీక్ష ప్రారంభం కాగా కొందరు విద్యార్థులు 11గంటల 3 నిముషాలకు హాజరయ్యారు. దీంతో ఐదుగురు విద్యార్థులను అనుమతించకపోవటంతో నిరాశతో వెనుదిరిగారు.



టిజెపిఎస్‌లో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

ఫ్లై ఓవర్ కాకుండా బ్రిడ్జి నిర్మిస్తే చారిత్రాత్మక తప్పిదమే

ప్రజాశక్తి-గుంటూరు

నవ్యాంధ్రప్రదేశ్ రాజధానిలో గుంటూరు నడిబడ్డున ఉన్న శంకర్ విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జ్ స్థానంలో నిర్మించబోతున్న ఫ్లైఓవర్ రాబోయే తరాలకు ఉపయోగపడే విధంగా నిర్మించాలని అరండల్‌పేట, బ్రాడీపేట షాప్ ఓనర్స్ అండ్ షాప్ కీపర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి నడింపల్లి గురుదత్ అన్నారు. ప్రజల సంక్షేమం కోసమే తాము డిజైన్‌లో సవరణలో కోరుతున్నామని తమకు ఎటువంటి రాజకీయ దురుద్దేశాలు అంటగట్టవద్దని ప్రజాప్రతినిధులను, అధికారులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం స్థానిక అరండల్ పేట ఓ హెూటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో గతంలో గల్లా జయదేవ్ హయాంలో నిర్మాణం చేస్తామని వాగ్దానం చేసిన ఐకానిక్ ఫ్లై ఓవర్ మ్యాపు, కూటమి ప్రభుత్వం ఇటీవల డిపిఆర్ ద్వారా ఆమోదించిన ప్లాన్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా గురుదత్ మాట్లాడుతూ గతంలో గల్లా జయదేవ్ హయాంలో రూ.167 కోట్ల అంచనాతో హిందూ కాలేజి నుండి లాడ్జి సెంటర్ వరకూ 1.4 కిలోమీటర్ల మేర ఫ్లైఓవర్ నిర్మిస్తామని, ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు లేకుండా ముందుగానే ఆర్‌యుబిలు నిర్మిస్తామని అప్పటి ఆర్అండ్‌బి మంత్రి అచ్చన్నాయుడు ప్రకటించారన్నారు. సింగిల్ పిల్లర్‌తో మెట్రో ఐకానిక్ తరహా ఫ్లైఓవర్ నిర్మిస్తామని డిపిఆర్ కూడా సిద్ధం చేశారన్నారు. ప్రస్తుత ఎంపి పెమ్మసాని చంద్రశేఖర్ గతేడాది అక్టోబర్‌లో ముందుగా ఆర్‌యుబి నిర్మించి, ఫ్లైఓవర్ నిర్మాణం చేస్తామని తెలియజేశారని, ఆతర్వాత సేతుబంధన్ పథకం ద్వారా రూ.98 కోట్లతో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తామని చెప్పటంతో తమతోపాటు, నగర ప్రజలంతా హతాసులయ్యామన్నారు. భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకోకుండా పొడవు కుదించి నిర్మిస్తే చరిత్రలో దిద్దుకోలేని తప్పు జరుగుతుందన్న వాస్తవాన్ని రాజకీయ పెద్దలు గుర్తించాలని కోరారు. పెమ్మసాని చంద్రశేఖర్‌ను అధికారులు పక్కదారి పట్టిస్తున్నారనటంలో సందేహం లేదన్నారు. కావున పెద్దలు విజ్ఞతతో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. ఫ్లైఓవర్ నిర్మాణం కాదని కేవలం ఓవర్ బ్రిడ్జి మాత్రమే కడతామని అనడం చారిత్రక తప్పిదం అవుతుందని గ్రహించాలన్నారు. అసోసియేషన్ నాయకులు బెల్లంకొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ వేలకోట్ల రూపాయలతో రాష్ట్ర రాజధానిని అభివృద్ధి చేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం రాజధానికి కేవలం 30 కిలోమీటర్ల దూరంలో విజన్ లేని నిర్మాణం చేయటం తగదన్నారు. సిటీ హౌస్ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి పి.ఎస్.మూర్తి మాట్లాడుతూ ప్రజలు అత్యధిక మెజారిటీతో కూటమిని గెలిపించారని, స్వల్పకాలిక ప్రయోజనాల కోసమే ఆర్ఓబి నిర్మిస్తామనటం లక్షలాది మంది ప్రజలను వంచించుటమేనని విమర్శించారు.కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పి.మల్లేశ్వరరావు, యుగంధర్, కార్తీక్, కే బాబు, శ్రీనివాస్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.



గత, ప్రస్తుత నమూనాలను ప్రదర్శిస్తున్న అసోసియేషన్ నాయకులు



ప్రధాని మోడీ పర్యటన వేళ వర్ష గుబులు



సభా వేదిక వద్ద ఆకాశంలో దట్టని మేఘాలు

ప్రజాశక్తి - తుళ్లూరు

ప్రధాని మోడీ రాజధాని అమరావతి పర్యటనకు వర్ష భయం వెంటాడుతోంది. ఆకాశంలో దట్టమైన మేఘాలు ప్రభుత్వానికి, అధికారులకు గుబులు పుట్టిస్తున్నాయి. మే 2న రాజధాని నిర్మాణ పనుల పున:ప్రారంభానికి మోడీ అమరావతి రానున్నారు. పలు అభివృద్ధి పనులను ప్రధాని ప్రారంభిస్తారు. అనంతరం సచివాలయం వెనుక రహదారి పక్కన జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారు.సభకు రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 5 లక్షల మంది ప్రజలు తరలివస్తారని అంచనా వేస్తున్నారు. ప్రధాని పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. రహదారులు, పార్కింగ్, తాగునీరు, ఆహారం, వైద్య సౌకర్యం కల్పించడం తదితర ఏర్పాట్లను చేస్తోంది. మంత్రులు, ఉన్నతాధికారులు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. పనులు బుధవారం సాయంత్రానికి పూర్తవుతాయని చెబుతున్నారు. ఎదురు చూస్తున్న సమయం సమీపిస్తుండడం, పనులు కొలిక్కి వస్తున్నవేళ వర్ష భయం వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో బుధవారం పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ ఏర్పాట్లను మరోసారి పరిశీలించారు. వర్షం వస్తే ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని చెప్పారు. కాగా బుధవారం రాత్రికి 90 శాతం పైగా ఏర్పాట్లు పూర్తయ్యాయి.



ఏర్పాట్ల పరిశీలించిన కలెక్టర్

రాజధాని అమరావతి పున:నిర్మాణ పనుల ప్రారంభోత్స వానికి ప్రధాని మోడి మే 2న అమరావతి రానున్న నేపథ్యంలో పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను బుధ వారం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ విశ్వనాథం, జిఎంసి కమిషనర్ పులి శ్రీనివాసులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ కె.శ్రీనివాస రావు,జెడ్పీ సిఇఓ జ్యోతిబసు, జిల్లా ఉపాధి అధికారి దుర్గాభాయి, రెవెన్యూ, పోలీస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.